క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ శ్రీ ఆంజనేయనగర్‌లో రోడ్డు నంబర్–7లో డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో దశలవారీగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, సీహెచ్. ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మూసాపేట: గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట యాదవబస్తీకి చెందిన చంద్రశేఖర్ (38), సరిత (36) పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 2 రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటలకు చంద్రశేఖర్‌గేదెలు తీసుకువచ్చేందుకు వెళ్లి తెల్లవారుజామున 3.30 గంటలకు ఇంటికి వచ్చాడు. అప్పటికే సరిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో అమీర్‌పేటలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఆల్విన్‌కాలనీ: బతుకమ్మ, దసరా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి కోరారు. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన సందర్భంగా బస్తీలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న హైమాస్ట్ ఎల్‌ఈడీ లైట్ల పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు


పూజలో జగదీశ్వర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, నాయకులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్ బస్తీలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయంలో సోమవారం ఆలయ ద్వారం పూజలు నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, పట్వారీ శశిధర్, రవి, జిల్లా గణేశ్, ప్రభాకర్, సమ్మారెడ్డి, సంగమేష్, రెహ్మాన్, శివ, వాసు, తిరుపతి, మోహన్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు శ్రీదేవి, శిరీష సత్తూర్, మణెమ్మ, అరుణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అంతంతే!

సమస్యల్లో పర్వత్‌నగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం

- నరిపడా లేని వైద్యులు, సిబ్బంది
- పరిసరాలు అస్తవ్యస్తం.
- ఇబ్బందుల్లో రోగులు


పర్వత్‌నగర్‌లోని ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి. రెండు దశాబ్దాల క్రితం పూర్వ డివిజన్ పర్వత్‌నగర్‌లో ఈ కేంద్రాన్ని నిర్మించారు. ఇక్కడికి సుమారు 40 బస్తీ కాలనీల ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. అయితే వసతుల లేమితో పాటు సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ ఆసుపత్రి 24 గంటలు సేవలందించాల్సి ఉండగా కేవలం ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే పని చేస్తోంది. ఈ కేంద్రానికి ప్రతిరోజు సుమారు 158 నుంచి 200 వరకు రోగులు వస్తుంటారు. ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. భద్రతా సిబ్బంది కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో ఆకతాయిలు ప్రహరీ దూకి ఆసుపత్రి ఆవరణలో మద్యం సైతం సేవిస్తుంటారు. ఇక్కడే సాధారణ ప్రసవాలు నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ అత్యవసరమైతే తప్ప కొండాపూర్, నీలోఫర్ లాంటి ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేస్తుంటారు. మరోవైపు ఆసుపత్రి చుట్టూ ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్, ఇతర వస్తువులను నెలల తరబడి పెడుతున్నారు. మరోవైపు ఆసుపత్రి సమీపంలో నివసిస్తున్న కొందరు నివాసితులు చెత్తాచెదారాన్ని ఆసుపత్రి ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో పారవేస్తున్నారు. ప్రహరీ సైతం అక్కడక్కడ బీటలు వారాయి. గతంలో పలుమార్లు సంబంధిత అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆసుపత్రి సిబ్బది, స్థానికులు వాపోతున్నారు. గతంలో సుమారు రూ. 50 లక్షల నిధులతో ఆసుపత్రిలో మరమ్మతులు చేయించారు. కానీ సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకోవైపు రోగుల కోసం మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నప్పటికీ తాగునీటి కొరతతో ఆసుపత్రికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని రోగులు కోరుతున్నారు.


ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు


బీటలు వారిన ఆసుపత్రి ప్రహరీ

వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నాం..



ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మరుగుదొడ్లు, మూత్రశాలల్లో నీటి సౌకర్యం లేదు. గర్భిణులను మహిళా వైద్యులు మాత్రమే చూడాలి. కానీ ఇక్కడ ఒక్క డాక్టర్ మాత్రమే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించడంతో పాటు సరిపడా వైద్యులను నియమించాలి.
–కే. సుజాత, తులసీనగర్

బీజేపీ నాయకుల 'చెట్ల పరిరక్షణ' కార్యక్రమం



ఆల్విన్‌కాలనీ: ప్రధానమంత్రి బర్త్‌డే వేడుకలను పురస్కరించుకుని 'సేవా పక్షం'లో భాగంగా వివేకానందనగర్ కాలనీలో బీజేపీ నాయకులు చెట్ల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను సోమవారం చేపట్టారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకుడు ఎం. కాంతారావు, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. వంశీరెడ్డి హాజరై చెట్లకు కొట్టిన మేకులు, పోస్టర్లు, కరెంట్ తీగలు తొలగించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నాయకుడు ఏ. గోపాల్‌రావు, కార్యక్రమ కన్వీనర్ రిపస్ రాజు, కో కన్వీనర్లు కే.వేణు, భాగంబీర్ మనోజ్, డివిజన్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి శ్రీనివాస్, మహిళా నాయకులు వెంకటేశ్వరనగర్ జయశ్రీ, మమత, డివిజన్ ఉపాధ్యక్షులు నాగేందర్ రెడ్డి, కనకచంద్రం, కరుణాకర్ రావు, నరసింహులు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

'వన్‌కాలనీ.. వన్ స్టాండ్' సమావేశం


సమావేశంలో పాల్గొన్న సీనియర్లు

కూకట్‌పల్లి: 'వన్‌కాలనీ వన్‌స్టాండ్' నినాదంతో జాన్‌మోజెస్, సయ్యద్ రావెల్లా అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా నివాసితులు, వృద్ధుల అభిప్రాయాలు సేకరించారు. కేపీహెచ్‌బీ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు కేపీహెచ్‌బీ కాలనీల్లోని అన్ని ఫేజ్‌ల్లోని యూత్ అసోసియేషన్లను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సూచనలను పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించారు. కాలనీల్లోని 600 హాస్టల్‌లో నివాసముంటున్న వారి వల్ల కేపీహెచ్‌బీ కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలన్నదే ఈ సమావేశం ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. కాలనీలో అన్ని ఫేజ్‌ల్లో నివాసితులను సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వారితో కలిసి 33 సమస్యలను పరిష్కరించుకొని హాస్టల్ యజమాన్యాలతో కలిసి చర్చించుకోవాలని నిర్ణయించారు. అయినా సమస్య పరిష్కారం కాకుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్ గౌడ్, అట్లూరి దీపక్, మగ్దుం, దిల్వార్, ముబీన్, దినేశ్ నాయుడు, సాయినాథ్ రెడ్డి, తులసీరెడ్డి వీహెచ్‌పీ తేజ, మహేశ్, ధనలక్ష్మి, వాసు వర్మ, అమర్‌నాథ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

మూసాపేట: హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు తమ గ్యాస్ కనెక్షన్‌కు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేసుకోవాలని శ్రీమానస గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ కాసాని ఆనంద్ సోమవారం తెలిపారు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళ్లకుండా గ్యాస్ సరఫరా చేసే డెలివరీ బాయ్స్ ఇంటి వద్దకు వచ్చి ఉచితంగా ఈ-కేవైసీ చేస్తారని పేర్కొన్నారు.

శ్రీ కృష్ణ రాయబారం శయన దృశ్యం ప్రదర్శన



కూకట్‌పల్లి: శరన్నవరాత్రి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో జీపీఎల్ మీడియా, హైదరాబాద్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భారత్ వికాస్ పరిషత్‌లో ప్రణవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి, పద్మశ్రీ డా. పద్మజా రెడ్డి శిష్యురాలు చిరంజీవి మద్దికొండ శ్రీకీర్తన కూచిపూడి నృత్యంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీకృష్ణ రాయబారం శయన దృశ్యం ప్రదర్శించారు. అదే విధంగా సత్య హరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటకం నుంచి కాటి సీను ప్రదర్శించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కేరళ మాజీ సీఎం ఉమెన్ చాందీ జ్ఞాపకార్థం పుష్పగిరి ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సహకారంతో ఆస్మత్‌పేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. కార్పొరేటర్ ముద్దం నరసింహాయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 668 మంది కంటి పరీక్షలు చేసుకోగా, 325 మందికి కళ్లద్దాలు అవసరమున్నాయని, 115 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్, వేణు, వరుణ్, యశ్వంత్, డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్, మన్నె ఉదయ్, సయ్యద్ ఎజాజ్, హరినాథ్, జంగయ్య, నర్సింగరావు, బాబన్న, లలిత, దుర్గా, సంతోషి, పిట్ల రాజు, బాలరాజ్, దేవేందర్, బాలయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

నాలా పనులు త్వరగా పూర్తి చేయండి


రాజీవ్‌గాంధీ నగర్‌లో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


జోనల్ కమిషనర్, అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మాధవరం

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని నాలా రిటైనింగ్ వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి సఫ్దార్‌నగర్, రాజీవ్ గాంధీనగర్ ప్రాంతాల్లోని నాలాను సోమవారం పరిశీలించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి మూడేళ్లయినా పనులు పూర్తి చేయకపోవడంపై అధికారుల తీరుపై మండిపడ్డారు. నిధులున్నా పనులు చేపట్టపోగా నాలా స్థలాలు కబ్జా అవుతుంటే కూడా పట్టించుకోకపోవడం ఏంటని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. వెంటనే కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

జోనల్ కమిషర్‌ను కలిసిన ఎమ్మెల్యే
జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాలా పనులు త్వరగా పూర్తి చేయకుంటే వచ్చే నెల 10న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, మహిళలు, యువతులు, చిన్నారులు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి కూడళ్ల వద్ద పెట్టి ఆడిపాడారు. అనంతరం కొలనుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. –కూకట్‌పల్లి


వేడుకల్లో కార్పొరేటర్ శిరీష, లలిత తదితరులు


భరత్‌నగర్ పోచమ్మ ఆలయం ప్రాంగణంలో ..


వివేకానందనగర్‌లో కార్పొరేటర్ తదితరులు


బాలాజీ స్వర్ణపురి కాలనీ బర్డ్స్ అండ్ బ్లూమ్ స్కూల్లో..

దేవీ శరన్నవరాత్రోత్సవాలు షురూ

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు ప్రతిరోజు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. కార్పొరేటర్లు, పార్టీల నాయకులు, భక్తులు ప్రత్యేక పూజలు, మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. –కూకట్‌పల్లి


మూసాపేటలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ..


కనకదుర్గమ్మ ఆలయంలో ..


పర్వత్‌నగర్ చౌరస్తాలో దుర్గా మల్లేశ్వరి ఆలయంలో ..


మోతీనగర్‌లోని శంకర్‌మఠంలో హంసవాహనంపై అమ్మవారు


రాఘవేంద్రనగర్ రేణుకా దేవి ఆలయంలో ..


సుమిత్రానగర్‌లో శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు


పర్వత్‌నగర్ ప్రధాన రోడ్డులోని పర్వతవర్ధిని శివాలయంలో ..


మూసాపేటలో సామూహిక కుంకుమార్చన


ఫతేనగర్ పైపులైన్ రోడ్డు జవహర్‌నగర్ కనకదుర్గాదేవి ఆలయంలో ..


దుబాయిగేట్‌లోని వైష్ణవిమాతా ఆలయంలో..